

చెత్త వేయవద్దని అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : రచనశ్రీ

కవాడిగూడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ బస్తీ ప్రజలకు సూచించారు. సోమవారం కవాడిగూడ డివిజన్‌లోని కొత్తబజార్ గ్రంథాలయ వీధిలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిశీలించేందుకు బస్తీవాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల కొత్త బజార్ గ్రంథాలయ వీధిలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. గోతులమయంగా రోడ్లు మారాయని నూతన రోడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆమెను కోరారు. అదేవిధంగా కొత్తబజార్ గ్రంథాలయం వద్ద నిత్యం గ్రంథాలయ లైబ్రరీ ప్రహరీ పక్కన చెత్తవేయడం వల్ల లైబ్రరీకి వచ్చే వారికి ఇబ్బందులు వస్తున్నాయని వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు, మునిసిపల్ సిబ్బందితో గ్రంథాలయం వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగింప చేసి ప్రత్యేకంగా ఇక్కడ చెత్త వేయరాదని బ్యానర్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రనాయకుడు జి.వెంకటేష్, నగరనాయకులు ఎంసి మహేందర్‌బాబు, బస్తీవాసులు వినోద్‌తో పాటు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో దేవనాథం, ఇన్‌స్పెక్టర్ సురేఖ

ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు

చిక్కడపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు. సోమవారం ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 1,17,599 రూపాయల ఆదాయం వచ్చింది. ఈ సందర్భంగా హుండీ లెక్కింపును దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షించారు. ఈవో మాట్లాడుతూ ఆలయాన్ని పునర్నిర్మాణం చేసిన తర్వాత మరింత అభివృద్ధి చేయడానికి భక్తుల సహకారంతో కృషి చేస్తున్నట్లు వివరించారు. ఆలయ సిబ్బంది, భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

ఘనంగా శత కలశాభిషేకం

చిక్కడపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలో పార్వతి క్షీరలింగేశ్వరస్వామి మందిరంలో స్వామివారికి శత కలశాభిషేకం నిర్వహించారు. శత కలశాలతో స్వామివారిని అభిషేకించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో లక్ష్మారెడ్డి, ఛైర్మన్ ఎం. నర్సింగ్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ ఏఈఈ వినోద్‌కుమార్, ప్రవీణ్

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ముషీరాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : భోలక్‌పూర్ డివిజన్ ఎస్‌బీఐ కాలనీలో గుంతలమయంగా మారిన రోడ్డును ఆధునికీకరించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సోమవారం పనులు ప్రారంభించారు. బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ ఏఈఈ వినోద్‌కుమార్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాలతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు భరత్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ దాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర : మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ఆధ్వర్యంలో తండ్రిలేక సంరక్షణ కోల్పోయిన విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం ఆర్థిక సహకారానికై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఈవో ఎస్.అంజనరెడ్డి తెలిపారు. ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు ఆర్థిక సహాయం పొందడానికి అర్హులని తెలిపారు. అర్హులైన విద్యార్థులు నవంబర్ 14వ తేదీ వరకు కాచిగూడలోని మున్నూరుకాపు ట్రస్ట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తండ్రి లేక సంరక్షకుని మరణ ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, గత సంవత్సరం మార్కుల పట్టిక, బ్యాంకుపాస్ బుక్ జిరాక్స్ కాపీలను జతచేయాలని కోరారు. పూర్తి వివరాలకు 9491627404 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం'

నల్లకుంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని ఆ పార్టీ ఓబీసీ మోర్చా స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎన్.మహేష్ కుమార్ ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఎన్.మహేష్‌కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నల్లకుంట డివిజన్‌కు చెందిన పార్టీ నాయకులతో కలిసి జూబ్లీహిల్స్ నియోకవర్గంలోని రహమత్‌నగర్ డివిజన్ గడపగడపకు బీజేపీ విజయం కోసం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రహమత్‌నగర్ డివిజన్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కమలం జెండా ఎగురడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.నర్సింగ్‌రావు, హిమగిరిగౌడ్, వెంకటేష్‌గౌడ్, క్రాంతి, భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని పార్టీ నాయకుడు ఎం.అనిల్‌కుమార్‌రెడ్డి, అంబర్‌పేట నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ అచ్చిని మహేష్ పేర్కొన్నారు. సోమవారం బాగ్‌అంబర్‌పేటలో సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల పట్ల ప్రజలు సానుకూలంగా లేరని అన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రజా సమస్యలను పట్టించుకోలేదనే విమర్శలు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఇంటి పోరు ఎక్కువగా ఉందన్నారు. దీంతో ప్రజలందరూ బీజేపీకి ఓట్లు వేసి గెలిపించాలని భావిస్తున్నారని పేర్కొన్నారు.

ఘనంగా సుజారమణ కల్చరల్ అకాడమీ వార్షికోత్సవం



వల్లభమూర్తికి పురస్కారం బహూకరిస్తున్న అతిథులు

చిక్కడపల్లి : సాంస్కృతిక సంస్థలు చేస్తున్న కళారంగ సేవ అభినందనీయమని ఐటీసీ మాజీ వైస్ ఛైర్మన్ కె. నందకుమార్ అన్నారు. సుజారమణ కల్చరల్ అకాడమీ 8వ వార్షికోత్సవం సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో ఘనంగా జరిగింది. ఈసందర్భంగా కళాభిమాని డా. వల్లభమూర్తికి పీవీఎల్ నరసింహారావు స్మారక పురస్కారం బహూకరించారు. నందకుమార్ మాట్లాడుతూ కళాసంస్థలను వదాన్యులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాజనార్దనమూర్తి, వంశీ రామరాజు, విజయసారధి, కెఎస్ మూర్తి, రాఘవాచారి, సనత్‌కుమార్, ప్రముఖ గాయని, కార్యక్రమ నిర్వాహకులు సుజారమణ, మారుతిరామ్, ఎంవై రావు, రామకృష్ణ, నాయుడు, చెన్నారావు, ఆమంత పాల్గొన్నారు. కళాపోషకులు లయన్ విజయకుమార్‌కు నివాళులర్పించారు. కాగా ఈఎస్ఐ కార్పొరేషన్ అధికారులు, ఈఎస్ఐ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులు, కంపెనీ అధికారులు, కళాభిమానులు, కళాపోషకులను, గాయనీగాయకులను సత్కరించారు.

పారదర్శకంగా ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక నిర్వహిస్తాం

కాంగ్రెస్ అంబర్‌పేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల అభిప్రాయ సేకరణ సభలో ఏఐసీసీ పరిశీలకులు శక్తిసింగ్ గోయెలే



సమావేశంలో అంబర్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకులు శక్తిసింగ్ గోయెలే, పక్కన డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి తదితరులు

రాంనగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుల ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక నిర్వహిస్తామని ఏఐసీసీ పరిశీలకులు శక్తిసింగ్ గోయెలే పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని నూతన అధ్యక్షుడిని నియమించడం జరుగుతుందన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్ష ఎన్నిక కోసం అంబర్‌పేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాల సేకరణ కోసం బాగ్‌అంబర్‌పేటలోని హోటల్ ధృవలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డీసీసీ అధ్యక్ష పదవికి ఎవరైనా పోటీ చేయవచ్చని, వారు దరఖాస్తు చేసుకుని ఒక్క కాలం కూడా వదలకుండా నింపి ఇవ్వాలని సూచించారు. పార్టీలో పోటీ సహజమని, ఎవరిని పదవి వరించినా అతనికి మద్దతుగా అందరు నిలవాలని సూచించారు. ఇందులో ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేదన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్ష ఎన్నికకు సంబంధించి శక్తిసింగ్ గోయలేను ఏఐసీసీ పరిశీలకులుగా పంపిందని, ప్రతి నాయకులు, కార్యకర్తలు వారి అభిప్రాయాలను తెలియజేయవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ పరిశీలకులు శక్తిసింగ్ గోయెలే, పీసీసీ పరిశీలకులుగా ఎంపీ మల్లు రవి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, నాగసీతారాములును అధిష్ఠానం నియమించింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ముజాహిద్ ఆలంఖాన్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శులు మధుసత్యంగౌడ్, జి.శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, పుల్లా నారాయణస్వామి, నాయకులు లక్‌పతి యాదగిరిగౌడ్, మోత రోహిత్, అభిజిత్‌యాదవ్, జె.సత్తిబాబు, గడ్డం శ్రీధర్‌గౌడ్, కె.రాజేశ్వర్‌రావు, హరితిలక్‌సింగ్, కోటం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష అభిప్రాయ సేకరణలో నేతల మధ్య వివాదం

ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్ష ఎన్నిక కోసం సోమవారం బాగ్‌అంబర్‌పేట ధృవ హోటల్‌లో నిర్వహించిన కార్యకర్తల అభిప్రాయ సేకరణలో కొంత స్వల్ప వివాదం తలెత్తింది. ఏఐసీసీ పరిశీలకుడిగా హాజరైన శక్తిసింగ్ గోయెలే ఒక గదిలో కూర్చుని అభిప్రాయలు సేకరిస్తుండగా బయట వివాదం చోటుచేసుకుంది. అంబర్‌పేట నియోజకవర్గానికి సంబంధం లేని కొందరు నాయకులు అక్కడికి రాగా మీరు ఎందుకు వచ్చారని వేరే కార్యకర్తలు ప్రశ్నించారు. ఇదే విషయంపై గొడవ ప్రారంభమైంది. దీంతో ఒకరినొకరు తిట్టుకోవడంతో గొడవ తీవ్రమైంది. ఈ విషయంపై డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి జోక్యం చేసుకుని అందరిపై ఫిర్యాదు చేస్తా అని హెచ్చరించారు. ఇతరులను పంపించడంతో గొడవ సద్దుమణిగింది.

ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు



చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు బిజ్జి రవి

ముషీరాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : పోలియో రహిత సమాజ స్థాపన కోసం ప్రభుత్వం చేపట్టిన 5సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేసే కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో రెండు రోజుల్లో 13,743 మంది చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు. మొదటి రోజు ప్రధాన కూడళ్లు, కమ్యూనిటీహాల్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయగా రెండవ రోజు సోమవారం ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేసుకోని చిన్నారులను గుర్తించి పిల్లలకు వైద్య సిబ్బంది చుక్కల మందు వేశారు. ముషీరాబాద్ గంగపుత్రకాలనీలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బిజ్జి రవి, పార్టీ నాయకుడు కృష్ణచారి వైద్య సిబ్బందితో కలిసి చిన్నారులకు చుక్కల మందు వేశారు. ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో 3,119 మంది చిన్నారులకు చుక్కల మందు వేశారు. భోలక్‌పూర్ యూపీహెచ్‌సీలో 5,305 మంది చిన్నారులకు రంగానగర్‌లోని బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీలో 5,319 మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు వైద్యులు తెలిపారు.

ఇంటింటికీ వెళ్లి.. సర్వే జరిపి..

5సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేసేందుకు ఇంటింటికీ వెళ్లి సర్వే జరిపి చుక్కల మందు వేస్తున్నామని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ డాక్టర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. తమ ఆస్పత్రి పరిధిలో ఇప్పటికే పిల్లలందరికీ చుక్కల మందు వేశామని ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే ఆస్పత్రికి వచ్చి పిల్లలకు చుక్కల మందు వేయించవచ్చని సూచించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.7,500 చెల్లించాలి



పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

బర్కత్‌పుర, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో పనిచేసి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు కనీస పెన్షన్ 7,500 రూపాయలు చెల్లించాలని నేషనల్ యాజిటేషన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు కె.శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి వై.వి.సుబ్బయ్య డిమాండ్ చేశారు. కనీస పెన్షన్ 7,500తో పాటు డీఏను కలిపి ఇవ్వాలన్నారు. సోమవారం బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో సీబీటీ సమావేశం సందర్భంగా అక్కడ నేషనల్ యాజిటేషన్ కమిటీ చేసిన ధర్నాకు మద్దతుగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు మెడికల్ సదుపాయం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారన్నా రు. రిటైర్డ్ ఉద్యోగి, అతని భార్యకు పూర్తి మెడికల్ సదుపాయం కల్పించాలన్నారు. పెన్షనర్లు వృద్ధాప్యంలో నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్లకు రిటర్న్ ఆఫ్ క్యాపిటల్(ఆర్‌వోసీ)ని 20ఏళ్లకు ఒక సారి చెల్లించి తిరిగి పెన్షన్ సదుపాయాన్ని కంటిన్యూ చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని లేకపోతే తమ పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు జి.ఎన్.రావు, సుధాకర్, కేజీరావు, రామేశ్వరం, ఎన్.ప్రసాదరావు, గంగాధర్, రామ్మూర్తి, వై.ఆర్.కె.రాజు, శ్రీనివాస్, భవాని, కోకిల, గిరిజారాణి పాల్గొన్నారు.



అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన లక్ష్మి కుటుంబ సభ్యులకు వైద్య చికిత్స కోసం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చొరవతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.3.50లక్షల ఎల్‌వోసీని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి కుటుంబ సభ్యులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి



ఏపీలోని కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ సభ్యుడిగా నగరానికి చెందిన టీడీపీ తెలంగాణ బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీపతి సతీష్ నియమితులైన సందర్భంగా ఆయనను టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం తరఫున దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో సోమవారం సన్మానసభ జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.సాయిబాబా, పలుస బాల్‌రాజ్‌గౌడ్, నల్లెల కిషోర్, నాయకులు ఎస్.ప్రకాష్, వెంకటేష్‌చౌదరి, యాదగిరి, శుక్లవేది పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి : హైదరాబాద్ సిటీ-2 పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏపీసీపీడీసీఎల్... ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. మారుతినగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని మక్తాలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

అసాధారణ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు



మాట్లాడుతున్న ఆయాచితం శ్రీధర్, పక్కన కళాజనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కవిగా చిత్రకారుడిగా నవలా రచయితగా అసాధారణ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఎందరో మహనుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా అడవి బాపిరాజు యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ అడవి బాపిరాజు నవల నారాయణరావు నేటికీ తెలుగు సాహితీలోకంలో అత్యుత్తమ కథల్లో ఒకటిగా చెప్పబడుతుందన్నారు. ప్రజల నోళ్లలో బాపిరాజు రాసిన బావా బావా పన్నీరు బావను పట్టుకు తన్నారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పాడుకుంటారని ఆ పాటతో బాపిరాజు పేరు పొందారని గుర్తుచేశారు. బాపిరాజు రాసిన చారిత్రక నవలలు గోన గన్నారెడ్డి, హిమబిందు పాఠ్యగ్రంథాలుగా ఎంపిక చేశారని వివరించారు. కథక్ అంజిబాబు, గాయకుడు వెంకటరావు, గానసభ పాలక మండలి సభ్యులు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

- **ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి**
- **పోగొట్టుకున్న 100 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేసిన డీసీపీ**



సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి

అంబర్‌పేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్లను యజమానులు జాగ్రత్తగా కాపాడుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి సూచించారు. సోమవారం అంబర్‌పేట ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోన్ పరిధిలోని 10 పోలీస్‌స్టేషన్లలో నెలరోజుల వ్యవధిలో బాధితులు పోగొట్టుకున్న 25 లక్షల రూపాయల విలువైన 100సెల్‌ఫోన్లను యజమానులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ యజమానులు తమ దగ్గర సెల్‌ఫోన్ ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సెల్‌ఫోన్ పోకుండా చూసుకోవాలన్నారు. బస్సులో ప్రయాణించేటప్పుడు సెల్‌ఫోన్ దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉన్నప్పుడు ఫోన్ దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. సెల్‌ఫోన్ యజమానులు తమ ఫోన్‌లను బ్యాగులో, లేదా చేతిలో పట్టుకుని బస్సు దిగాలని సూచించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే తమ సిమ్‌లను బ్లాక్ చేసి దగ్గరలో ఉన్న పీఎస్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని నిలబెడతాం



అభివాదం చేస్తున్న ప్రజా సంఘాలు, పలు పార్టీల నేతలు

రాంనగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజా సంఘాలు, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ ఉమ్మడి అభ్యర్థిని నిలబెడతామని పలువురు వక్తలు తెలిపారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షుడు ప్రఫుల్ రాంరెడ్డిలు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయని నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారుల నుంచి ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టి కాంగ్రెస్‌కు బుద్ధిచెబుతామన్నారు. ఉద్యమకారులకు గతంలో బీఆర్‌ఎస్, నేడు కాంగ్రెస్ పార్టీలు అన్యాయం చేశాయని ఆరోపించారు. ఈ పార్టీలను ఓడించడమే లక్ష్యంగా తాము ఉమ్మడి అభ్యర్థిని నిలబెడతామన్నారు. తాము బరిలో నిలిపే అభ్యర్థికి జూబ్లీహిల్స్ ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రన్న, మోహన్ బైరాగి, అంసోల్ లక్ష్మణ్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, ప్రజ్యోత్‌కుమార్, సుజీ, లావణ్య, సుచరిత, బోయపల్లి రంగారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

నేడు అన్నపూర్ణకు అభినందన అక్కినేని పురస్కార ప్రదానోత్సవం

చిక్కడపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అభినందన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం త్యాగరాయగానసభలో ప్రముఖ సినీనటి అన్నపూర్ణకు అభినందన అక్కినేని పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ స్థాపక కార్యదర్శి ఇ. భవాని తెలిపారు. ప్రముఖ నటులు అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా 800 సినిమాల్లో అమ్మ పాత్రలను ధరించి సినిమాలకే అమ్మగా పేరుపొందిన ప్రముఖ నటీమణి అన్నపూర్ణకు ఈ అవార్డును ఆధ్యాత్మిక గాయని పద్మశ్రీ శోభారాజు బహూకరిస్తారని వివరించారు.

నేడు ఏ, బి బ్లాక్ కమిటీల సమావేశం

ముషీరాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఏ, బి బ్లాక్ కమిటీల సమావేశం మంగళవారం ఉదయం 10గంటలకు ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ భవనంలో నిర్వహించనున్నట్లు యూత్ కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సంపపాక వెంకట్ సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ కేంద్రమంత్రి సీ.పి జోషీ, ఎమ్మెల్యే పరిణితరెడ్డి, పీసీసీ కార్యదర్శి పవన్ హాజరవుతారని తెలిపారు. సమావేశాన్ని విజయంతం చేసేందుకు బ్లాక్ కమిటీ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నేతలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు కలామ్ బెస్ట్ టీచర్స్ అవార్డు-2025 ప్రదానం

ముషీరాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ 94వ జయంతిని పురస్కరించుకొని ఈనెల 15న ఉదయం 10గంటలకు రవీంద్రభారతిలో డాక్టర్ కలామ్ బెస్ట్ టీచర్స్ అవార్డు-2025 ప్రదానం చేయనున్నట్లు లీడ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ ఎన్. బాలకృష్ణ సుదర్శన్ సోమవారం తెలిపారు. రవీంద్రభారతిలో జరుగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పాఠశాలల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ హాజరవుతారని తెలిపారు.

కార్మిక సమస్యలపై సీఐటీయూ పోరాటం

రాంనగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : కార్మిక సమస్యలపై సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ పోరాటం చేస్తుందని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.దశరథ్, కె.కుమారస్వామి పేర్కొన్నారు. సోమవారం గోల్కొండ చౌరస్తాలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 11, 12వ తేదీల్లో తమ కమిటీ మహాసభలు ఘనంగా జరిగాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయించామన్నారు. ఈ మహాసభలకు కార్మికుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు.

మూసాపేట్ జెడ్పీహెచ్‌ఎస్‌ను అభివృద్ధి చేసిన మార్కండేయ ఫౌండేషన్

చిక్కడపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మూసాపేట్ జెడ్పీహెచ్‌ఎస్‌ను చిక్కడపల్లికి చెందిన మార్కండేయ ఫౌండేషన్ సభ్యులు అభివృద్ధి చేశారు. ఈసందర్భంగా సోమవారం సాయంత్రం ఫౌండేషన్ ప్రతినిధులు అక్కినపల్లి కిశోర్, శ్రీదేవిలు చిక్కడపల్లిలో వివరాలు వెల్లడించారు. పాఠశాల టాయ్‌లెట్స్‌లో 12 కమోడ్స్, టైల్స్, మంజీరా వాటర్ కనెక్షన్ ఏర్పాటు, బాలికల వాష్‌రూమ్ అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ పటిష్టం చేయడం, పక్కనున్న మసీదులో నుంచి తాగునీటి లీకేజీ వల్ల పాఠశాలలో ఏర్పడుతున్న ఇబ్బందుల తొలగింపు, పాఠశాలలోని బాత్రూమ్‌ల్లో ఏడు నూతన తలుపుల ఏర్పాటు, లైబ్రరీ గదిలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు నిర్వహించినట్లు తెలిపారు. కాగా పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన మార్కండేయ ఫౌండేషన్ ప్రతినిధులు కిషోర్, శ్రీదేవి తదితరులను పాఠశాల నిర్వాహకులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

బాలిక ఆత్మహత్య



వైష్ణవి (ఫైల్)

అంబర్‌పేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : చదువుకోకుండా ఇంటి వద్దనే ఉన్న కుమార్తెను చదువుకోమని తల్లి మందలించినందుకు ఆ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అంబర్‌పేట పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన రమేష్ జ్యోతి ఏడు నెలలుగా అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె వైష్ణవి(17), ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువు మానేసి ఇంట్లోనే ఉంటుంది. దీంతో ఈనెల 12న ఉదయం జ్యోతి తన కుమార్తె వైష్ణవిని చదువుకోమని కాలేజీకి వెళ్లమని మందలించింది. దీంతో తాను చేస్తున్న ప్రైవేట్ ఉద్యోగానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపు లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. తలుపులు కొట్టగా తెరవలేదు. ఇంటి పక్క వారిని పిలిపించి తలుపులు పగలగొట్టి చూడగా ఇంట్లోని ఫ్యాన్‌కు వైష్ణవి చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే 108ను పిలిపించి చూడగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వారు తెలిపారు. జ్యోతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ తరుణ్‌కుమర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

బర్కత్‌పుర, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఫారుఖ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ ఇస్మాయిల్(79) సోమవారం బుద్వేల్-శివరాంపల్లి రైల్వేస్టేషన్ల నడుమ బంధువుల ఇంటికి వెళ్లడానికి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. అయితే ఇస్మాయిల్‌కు చెవుడు వల్ల రైలు వస్తున్న సమయం గమనించలేకపోయాడు. దీంతో ప్రమాదానికి గురయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.